క్లుప్తంగా

భారీ వర్షం



తుక్కుగూడ: ఓఆర్ఆర్ సమీపంలోని పొలాల్లో కురుస్తున్న వర్షం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, మంఖాల్, రావిర్యాల, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీశైలం జాతీయ రహదారితో పాటు, ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కందుకూరు, మహేశ్వరం మండలాల్లో..

కందుకూరు: కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఆహ్లాదకరంగా మారింది.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అబ్కారీ, క్రీడలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అబ్కారీ గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలో అనాథ విద్యార్థి గృహంలోని పిల్లలకు పండ్లు, మిఠాయిలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎస్ జీఓ రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, కోశాధికారి పి. రవీందర్ కుమార్, అబ్కారీ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు టి. రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి డి. అరుణ్ కుమార్, సహాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి టి.లక్ష్మణ్ గౌడ్, కమర్షియల్ టాక్స్ అధ్యక్షుడు బి. వెంకటయ్య, మేడ్చల్ అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, శిరీష, అబ్కారీ అధికారులు బి.హనుమంత రావు, కె. శ్రీనివాస్, జి.శ్రీనివాస్ రావు, చంద్ర శేఖర్ గౌడ్, కల్పన, సరళ, విష్ణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనాథ విద్యార్థి గృహ మేనేజింగ్ డైరెక్టర్ మార్గం రాజేష్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



నూతన వైద్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు

తుక్కుగూడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో నూతనంగా నియమితులైన 35 మంది వైద్యులకు గురువారం ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 73 బస్తీ దవాఖానాలను మంజూరు చేశామన్నారు. అందులో 57 దవాఖానాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నూతన వైద్యులు వారికి కేటాయించిన ఆస్పత్రిలో అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడగళ్ల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వడగండ్ల బీభత్సంతో మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం తక్షణమే రైతులకు పరిహారం అందజేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి వడగండ్ల వల్ల నష్టపోయిన పంటలను, దెబ్బతిన్న ఇళ్లను, మృత్యువాతకు గురైన కోళ్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతాధికారుల ద్వారా.. నష్టపోయిన పంటలు, మృత్యువాతకు గురైన కోళ్లను, దెబ్బతిన్న ఇళ్ల సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, గణేష్‌నాయక్, కిషన్‌నాయక్, చందునాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

21న తైబజారు వేలం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ 2023–24 సంవత్సరానికి తైబజారు వేలం ఈనెల 21న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షలు డీడీ తీసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని ఆయన సూచించారు.

దళారుల చేతిలో రైతు బజార్లు

రైతు పండించిన పంటను స్వయంగా విక్రయించి, ఆర్థికంగా లబ్ధి పొందడంతో పాటు వినియోగదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్లు పూర్తిగా దళారుల చేతులో చిక్కాయి. దీంతో రైతులు రోడ్డుపైన.. మధ్య వర్తులు మార్కెట్లో క్రయవిక్రయాలు జరుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

- రైతు రోడ్డుపై.. మధ్యవర్తులు మార్కెట్లో!
- సంతలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్న వైనం
- ఎన్టీఆర్‌నగర్ అంగడిలో వింత పరిస్థితి
- చేసేదిలేక ఫుట్‌పాత్‌పైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

హుడాకాంప్లెక్స్: జిల్లాలో అత్యధిక శాతం రైతులు తమ పంటపొలాల్లో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తుంటారు. వీరిలో కొంతమంది రైతులు పండించిన పంటను స్వయంగా రైతుబజార్లకు తరలించి చాలా తక్కువ ధరకే విక్రయిస్తుంటారు. పంటను సకాలంలో అమ్ముకోవడం వలన వీరికి నష్టాల బాధ తప్పుతుంది. ప్రజలకు కూడా తక్కువ ధరతో తాజా కూరగాయాలు తిన్నామన్న సంతృప్తి మిగులుతుంది. దీంతో రైతు బజార్లు నిత్యం క్రయవిక్రయదారులతో కళకళలాడుతుంటాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇక్కడే అసలు కథ మొదలయింది. మార్కెట్ నిర్వాహకులు, దళారులు, సరకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు ఏకమై రైతులను రైతు బజార్లోకి రానీయకుండా అడ్డుకోవడం గమనార్హం.

కమీషన్ ఏజెంట్ల అభ్యంతరం

సరూర్‌నగర్ మండల పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. 75 మంది వ్యాపారులకు దుకాణాలు కేటాయించారు. వీరు విక్రయించే కాయగూరల్లో ఒక శాతం మార్కెట్ కమిటీకి కమీషన్ చెల్లిస్తుంటారు. రైతుల నుంచి ఈ కమీషన్ వసూలు చేయడానికి వీల్లేదు. రైతులు మార్కెట్లోకి వచ్చి తక్కువ ధరకే కూరగాయలు విక్రయిస్తే.. కమిషన్ ఎజెంట్లు, మార్కెట్ కమిటీ నిర్వాహకులు నష్టపోవాల్సి వస్తోంది. దీన్ని సాకుగా చూపించి మార్కెట్ కమిటీ నిర్వాహకుల, ఏజెంట్లు రైతులను మార్కెట్లోకి అనుమతించకుండా అడ్డుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో వారంతా మార్కెట్‌కు ఎదురుగా ఉన్న సర్వీసు రోడ్డుపై కుప్పలు పోసి కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుండటంతో ఇటు పోలీసులు, అటు జీహెచ్ఎంసీ కార్మికుల నుంచి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఎదుట సర్వీసు రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న రైతులు

లోపలికి రానివ్వడం లేదు



నా పొలంలో ఆకు కూరలు, కూరగాయలు పండిస్తాను. రోజు పంటను కోస్తాం. ఎప్పటికప్పుడే అమ్ముకోవాల్సి ఉంటుంది. తాజా కాయగూరలను తీసుకొచ్చి తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. దళారులు మార్కెట్లోకి రానివ్వక పోవడంతో రోడ్డుపైనే విక్రయించుకోవాల్సి వస్తోంది.

– వెంకటమ్మ, ఇబ్రహీంపట్నం

ఇబ్బంది పడుతున్నాం



తక్కువ ధరకే కూరగాయలు విక్రయిస్తున్నాం. ఇది గిట్టని ఏజెంట్లు తమను టార్గెట్ చేస్తున్నారు. రోడ్డుపై అమ్ముకుంటున్నా సరే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసి మరింత ఇబ్బంది పెడుతున్నారు.

– శ్రీనివాస్, మంచాల

డీసీఎం డ్రైవర్లే దళారులు

కొంత మంది డీసీఎం డ్రైవర్లు ముఠాగా ఏర్పడ్డారు. మార్కెట్‌లోని ఏజెంట్లకు సరుకును అమ్మితే.. మార్కెట్ సెస్ కట్టాల్సి వస్తుందని భావించి, రైతుల పేరుతో డ్రామా ఆడుతున్నారు. దళారులే రైతుల పేరుతో సర్వీసు రోడ్డులో విక్రయాలు జరుపుతున్నారు. ఈ అంశంపై ఇప్పటికే పోలీసులకు, జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశాం.

– నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ ఈఓ

26 మంది గైర్హాజరు

కందుకూరు: మండల పరిధిలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 3 కేంద్రాల్లో 1055 మందికి గాను 26 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 320 మందికి గాను 10 మంది గైర్హాజవ్వగా, మోడల్ స్కూల్‌లో 421 మందికి గాను 12 మంది, విద్యామయి జూనియర్ కళాశాలలో 314 మందికి గాను నలుగురు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

బందోబస్తు పరిశీలన



బందోబస్తును పర్యవేక్షిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ స్టేడియంలో జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ, బందోబస్తు ఏర్పాట్లను రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సీపీ వెంట జాయింట్ సీపీ సత్యనారాయణ, ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, డీసీపీ ఎల్‌బీనగర్ సాయిశ్రీ, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ దాసరి బాబు, పెంటయ్య మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని కార్మికులు రెండు పూటల పనిచేస్తున్నారని, అలా కాకుండా ఒక పూట పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు ఏడాదికి రెండు జతలబట్టలు ఇచ్చి కుట్టుగూలి కూడా ఇవ్వాలన్నారు. రెండు జతల చెప్పులు, కామాటీలకు బ్లౌజులు, సీపర్లకు చీపుర్లు, పొడవైన కర్రలు, బెల్లం, నూనె, మాస్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు రూ.21 వేతనం ఇస్తున్నారని ఆదే విధంగా తెలంగాణలో కూడా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.నర్సింహా, వెంకయ్య, శ్రీను, మల్లిఖార్జున్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులున్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పేదల కోసమే 'కంటివెలుగు'



కంటి పరీక్ష చేయించుకుంటున్న వృద్ధుడు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ బాలమణి సూచించారు. గురువారం ఈస్ట్ గాయత్రినగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఆమె ప్రారంభించారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసమే సీఎం కేసీఆర్ కంటివెలుగుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. కాలనీ అధ్యక్షుడు కొత్త వెంకటయ్య, శ్రీరామ్‌నాయక్, లక్ష్మణ్ ఉన్నారు.

దాతృత్వం చాటుకున్న తలారి మల్లేశ్

దివ్యాంగుడికి కృత్రిమ కాలు అమర్చేందుకు ఆర్థికసాయం

యాచారం: కాలుకు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో కాలును తొలగించారు. ఇక ఒంటి కాలితో నడవలేననే బాధతో ఉన్న దివ్యాంగుడికి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్ కృతిమ కాలును బిగించి అండగా నిలిచాడు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పంతం వెంకటయ్యకు కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో కొద్దినెలల కింద కాలును తీసేసారు. దీంతో అప్పటి నుంచి ఒక కాలుతో నడవలేక ఇంట్లోనే ఉంటున్నాడు. ఇక నేను నడవలేననే బాధతో ఉన్న వెంకటయ్యకు గ్రామానికి చెందిన తలారి మల్లేశ్ గురువారం నగరానికి తీసుకెళ్లి తన సొంత డబ్బులు పెట్టి కృతిమ కాలును అమర్చించాడు. దీంతో వెంకటయ్య ప్రస్తుతం కృతిమ కాలుతో ఎప్పటి మాదిరిగానే నడుస్తున్నాడు. ఈ సందర్భంగా తలారి మల్లేశ్‌కు దివ్యాంగుడు వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపాడు.



దివ్యాంగుడు వెంకటయ్యతో మల్లేశ్

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ప్రత్యేక పూజలకు ముస్తాబైన సీతారామాలయం

కందుకూరు: మహేశ్వరం మండల కేంద్రంలో మోదిని శంకరప్ప కుమారులు సొంత నిధులతో నిర్మిస్తున్న నూతనంగా శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభిస్తామని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాలొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పూజా కార్యక్రమాలు..

17న శుక్రవారం ఉదయం గోపూజ,ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవచనము, ఋత్విగ్వరణం, పంచగవ్య ప్రాశనము, యాగశాల ప్రవేశం, అంకురారోపణం, మంటపదేవతాపూజ, అగ్నిస్థాపన, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం మండప దేవతా హవనం, జలాధివాసం, మంగళహారతి, ప్రదోష పూజ, రాజ ఉపచారాలు, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. 18న శనివారం ఆవాహిత పూజ, సుదర్శన హవనం, సుందరాకాండ హవనం, మహాస్నపనం, ధాన్యశయ్య, ఫల, పుష్ప అదివాసము, ఆదివాస హోమాలు, తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాదం. 19న ఆదివారం రోజు ఆవాహిత పూజ, గర్తన్యాసం , యంత్రస్థాపన , విగ్రహప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బలిప్రదానం, పూర్ణాహుతి, మహామంగళ హారతి, ఆశీర్వాదం, సన్మానం, తీర్థం, అన్నప్రసాదం. మీన లగ్న సుముహూర్తమున ఉదయం 8:35 నిమిషాలకు యంత్రస్థాపన జరుపబడును. పూర్ణాహుతి అనంతరం సీతారామ కల్యాణం జరుగుతుంది. ఈ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి,జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ వాణి దేవి, మాజీ మంత్రి దేవేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతా నాయక్, సర్పంచ్ ప్రియాంక , ఎంపీటీసీ పలువురు హాజరవుతారని ఆలయ నిర్మాణ నిర్వాహకులు మోదినిశంకరప్ప, శివకుమార్,శివమూర్తి,శివప్రసాద్, గాండ్ల వీరన్నలు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మహేశ్వరంలోని సీతారామాలయం

కృపాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి: తీగల



అన్నదానం చేస్తున్న తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట ప్రాంతంలో దివంగత తీగల కృపాకర్‌రెడ్డి స్కూల్‌ను స్థాపించి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యనందించారని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. టీఆర్ఆర్ గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి 2వ వర్ధంతి సందర్భంగా గురువారం మీర్‌పేట కూడలిలో పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణారెడ్డి హాజరై కృపాకర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, తీగల నితీష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నీలిమారెడ్డి పాల్గొన్నారు.

మైనింగ్ నిలిపే వరకు ఉద్యమం

సాకిబండతండాలో అఖిలపక్షం నాయకుల సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాలో మైనింగ్ పనులను నిలిపివేయకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వివిధ పార్టీల నాయకులు హెచ్చరించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా మైనింగ్‌కు అనుమతి ఎలా ఇస్తారని పలువురు ప్రశ్నించారు. సాకిబండతాండాలో మైనింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం సాకిబండతండాలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జాతీయ నాయకులు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్లు మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మైనింగ్‌తో తాము పడుతున్న ఇబ్బందులను అఖిలపక్షనాయకులకు వివరించారు. మైనింగ్ పనులు చేపట్టడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని దుమ్ముధూళితో అనారోగ్యం బారినపడుతున్నామని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని వివరించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జోక్యం చేసుకుని మైనింగ్ పనులకు అనుమతులు రద్దు చేయించాలని వారు డిమాండ్ చేశారు. మైనింగ్ పనులకు అనుమతిచ్చే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారని కానీ సాకిబండతండా సమీపంలో మైనింగ్ అనుమతికి ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా అక్రమంగా అనుమతిచ్చారని వారు ఆరోపించారు. పనులు నిలిపివేయకపోతే రెండు మూడు రోజుల్లో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని అప్పటికీ మైనింగ్ పనులు రద్దు చేయకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. వివిధ పార్టీల నాయకులు రమేశ్‌నాయక్, శ్రీను, వినోద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల వేట ముమ్మరం!

జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో ఈ నెల ప్రారంభం నుంచి కుక్కల వేట కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులతో పాటు రోజువారీగా కుక్కల వేట కోసం 10 వాహనాలతోపాటు అదనపు సిబ్బందిని నియమించారు.

- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- ఇప్పటివరకు 1080 శునకాలకు శస్త్ర చికిత్సలు
- నిత్యం 150 కుక్కలకు ఆపరేషన్లు, యాంటీ రేబిస్ టీకాలు
- జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన

ఎల్‌బీనగర్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఐదు సర్కిళ్ల పరిధిలో నిత్యం 100 నుంచి 150 వరకు కుక్కలను వివిధ కాలనీలో పట్టుకుంటున్నారు. ఆయా కుక్కలకు వెంటనే ఆపరేషన్లు చేయడంతోపాటు కుక్క కాటు వలన ప్రజలు రోగాల బారిన పడకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) కూడా వేస్తున్నారు.

కుక్కలకు కు.ని ఆపరేషన్లు

మార్చి నుంచి నిర్వహిస్తున్న కుక్కల వేటలో భాగంగా ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు సుమారు సుమారు 1080 కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారుల తోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వీధి కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న ఆపరేషన్లకుగాను ఒక్కొక్క కుక్కకు రూ. 1500ల ప్రకారం చెల్లిస్తున్నారు. దీంతో కుక్కల ఆపరేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలా ఆపరేషన్లు చేసిన కుక్కలను తిరిగి ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే వదలిపెడుతున్నారు. ఆపరేషన్ చేసిన కుక్కలకు చెవి భాగంలో కొంత మేర కత్తిరించడంతో ఆపరేషన్లయిన కుక్కలను సులువుగా గుర్తించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

వీధి కుక్కలపై అవగాహన

విద్యార్థులకు కుక్కల ప్రవర్తనపై ఛాయాచిత్రాలను ప్రదర్శిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 285 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. 85,900 మంది విద్యార్థులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారని అధికారులు వెల్లడించారు. కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో 563 కాలనీల్లో వీధి కుక్కల బెడదను ఎలా నివారించుకోవాలనే అంశాలపై ప్రజలను చైతన్యపర్చారు.

మాంసం దుకాణాల నిర్వాహకులకు నోటీసులు

చికెన్, మటన్ షాపు నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ మాంసం వ్యర్థాలను వేయకుండా ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. దుకాణాల వద్ద వ్యర్థాలను వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు 523 మంది చికెన్, మటన్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. హాస్టల్ నిర్వాహకులకు కుక్కలపై అవగాహన కల్పించి... హాస్టళ్లలో మిగిలిపోయిన ఆహారం, ఇతర ఆహార వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి ముందుకు వచ్చే గార్బేజీ కార్మికులకే ఇవ్వాలని స్పష్టం చేస్తున్నారు.



వీధి కుక్కలను పట్టుకుంటుకున్న సిబ్బంది (ఫైల్)

స్పెషల్ డ్రైవ్‌తో మంచి ఫలితాలు

వీధి కుక్కల బారి నుంచి చిన్నారులు, ప్రజలను కాపాడేందుకు వెటర్నరీ విభాగం చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ మంచి ఫలితాలను ఇస్తోంది. విద్యార్థులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. కుక్కలు ఎదురైనప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించాం. వీధి కుక్కల కోసం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో సుమారు 82 ప్రాంతాల్లో నీటి తొట్టెల ద్వారా తాగునీటిని అందజేస్తున్నాం. ఆపరేషన్లు చేయడం ద్వారా వాటి సంతానోత్పత్తిని తగ్గిస్తున్నాం. అవి కరిచినప్పుడు రేబిస్ వ్యాధి సోకకుండా ఆపరేషన్లు చేసే సమయంలోనే యాంటీ రేబిష్ టీకాలను వేస్తున్నాం. ప్రజలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ రంజిత్, ఎల్‌బీనగర్ జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్

ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రియ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డయాలసిస్, ఇతర రోగుల సౌకర్యార్థం ఆస్పత్రిలో లిఫ్ట్ వసతి కల్పించాలని ఆమె కోరారు. ఆస్పత్రిలో సరైన మంచినీటి సౌకర్యం లేదని, నీటి కోసం ఆస్పత్రి తరపున రూ. 30 లక్షలు కంట్రిబ్యూషన్ చెల్లించలేమని ఆమె ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుతో మాట్లాడి ఆస్పత్రికి మంచినీటి కనెక్షన్ ఇప్పిస్తామని అన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీతో మాట్లాడి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన వైద్యసేవలు అందించాలని, ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది రాజన్, గఫర్, ఈశ్వరమ్మ, సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుస్వారాల గని 'కేవీ మహదేవన్'

జస్టిస్ చంద్రకుమార్

హస్తినాపురం: స్వరాల కంటే సాహిత్యానికి పెద్దపీట వేసిన గొప్ప సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్ అని ఉమ్మడి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. గురువారం హస్తినాపురంలో స్వర బ్రహ్మ కేవీ మహదేవన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జస్టిస్ చంద్రకుమార్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... కవి పాట రాసిన తరువాతే మహదేవన్ స్వరాలు కూర్చేవారన్నారు. మహదేవన్ సంగీతం అందించిన మంచి మనసులు చిత్రంలోని మామా.. మామా పాట అప్పటికి... ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ పాటగా నిలిచిందన్నారు. ఆ పాటతోనే ఆయనను అందరూ మామా అని పిలిచేవారని గుర్తుచేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మాజీ ఐఏఎస్ అధికారి టి.సత్యనారాయణరావు మాట్లాడుతూ... సంగీతం విశ్వజనీయమైనదని అన్నారు. ముఖ్యంగా మహదేవన్ సంగీతం అందించిన శంకరాభరణం సంగీతం ప్రపంచంలో గొప్పమైలు రాయి అంటూ ప్రశంసించారు.



మహదేవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్